# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు.**

2. **ధరల మద్దతు పథకం కింద ఈ రోజు నుంచి టమాటా సేకరణ ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లో దేవాలయాల అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.**

4. **తెలంగాణలో నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు.**

5. **అల్పపీడనం ప్రభావంతోఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 29, 30 తేదీల్లో భారీ వర్షాలు కురిసే. అవకాశముందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

**===========================**

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. అమరావతిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన మంత్రి.. అక్కడికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాదర్బార్ లో స్వీకరించిన ప్రతి సమస్యను స్థానిక అధికారులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. అలాగే రెవెన్యూశాఖలో ఆన్‌లైన్ ట్యాంపరింగ్, రికార్డుల తారుమారుపై గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి బాధితుల నుంచి అధికారులు ఫిర్యాదులు తీసుకొని పరిష్కరిస్తారని చెప్పారు. ఈ సభల్లో గ్రామస్థాయి అధికారుల నుంచి కలెక్టర్ వరకు పాల్గొంటారని మంత్రి తెలిపారు.

---------------------------

కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్ లో 5 నూతన జిల్లాలు ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన లద్దాఖ్ ను నిర్మించాలనే సంకల్పంలో భాగంగా 5 కొత్త జిల్లాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు సామాజిక మాధ్యమం వేదికగా కేంద్రమంత్రి ప్రకటించారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే జన్‌స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, చాంగ్‌థాంగ్ జిల్లాలతో ప్రభుత్వ పాలన మరింత పటిష్టమవుతుందని, ప్రతీ ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందుతాయని అన్నారు. మరోవైపు లద్దాఖ్

ఐదు కొత్త జిల్లాల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ సందర్భంగా లద్దాఖ్ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మెరుగైన పాలన శ్రేయస్సు కు ఇది ఒక ముందడుగు అని ప్రధాన మంత్రి సామాజిక మాధ్యమ పోస్ట్ లో పేర్కొన్నారు. జంస్కార్, ద్రాస్, షామ్, నుబ్రా, ప్రాంతాలు అభివృద్ధి పథంలో నిలిచి, ప్రజలకు సేవలు అవకాశాలు చేరువవుతాయని మోదీ చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ధరల మద్దతు పథకం కింద రైతుల్ని ఆదుకునేందుకు ఈ రోజు నుంచి అనంతపురం మార్కెట్లో టమాటా సేకరణ ప్రారంభించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. టమాటా ధరల తగ్గుదలపై మార్కెటింగ్ శాఖ అధికారులు, జిల్లాల సంయుక్త కలెక్టర్లతో సమీక్షించినట్లు పేర్కొన్నారు. సేకరించిన టమాటాలను రాష్ట్రంలోని రైతు బజార్లలో అమ్మేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో టమాటా కిలోకు 7 రూపాయల నుంచి 23రూపాయల వరకు లభిస్తోందని.. రోజుకు 3 వేల టన్నుల నుంచి 4,500 టన్నుల వరకు మార్కెట్‌కు వస్తున్నాయని వివరించారు. వర్షాల కారణంగా పంట నాణ్యత దెబ్బతినటంతో ధరలు తగ్గాయని మంత్రి ప్రకటనలో వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో దేవాలయాల అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో నిన్న అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేవాలయాల పటిష్ఠత కోసం అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. పండగలు, ముఖ్య దినాల్లో భక్తులు ఇబ్బంది పడకుండా పలు చర్యలు తీసుకుంటామని, దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు, అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు బ్రాహ్మణుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పింఛన్ పథకం –సీపీఎస్ స్థానంలో కొత్తగా ఏకీకృత పింఛన్ పథకం-యూపీఎస్‌ను అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం విధి విధానాలు రూపొందించింది. 2025 ఏప్రిల్ 1 నుంచి యూపీఎస్ విధానం అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. 2004 ఏప్రిల్ 1 తర్వాత సర్వీసులో చేరిన ఉద్యోగులకు ప్రస్తుతం ఎన్‌పీఎస్ వర్తిస్తోందని, వీరందరూ యూపీఎస్ పరిధిలోకి రావడంతో 23 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం తెలిపింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి మండలి సమావేశంలో ఈ విధానానికి ఆమోదం తెలిపింది.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం వైద్య పర్యాటకానికి ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మూడు వారాల శిక్షణ ముగించుకున్న ఈజిప్టు వాణిజ్య దౌత్యవేత్తల బృందంతో నిన్న రాష్ట్ర సచివాలయంలో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో అత్యాధునిక వైద్య సంస్థలతో వైద్య పర్యాటకాన్ని విస్తరిస్తోందని . తెలంగాణ రాష్ట్రం ఔషధ ఎగుమతుల్లో ప్రపంచంలోని అనేక దేశాలతో పోటీపడే స్థాయికి చేరుకుందని వెల్లడించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒకటి చొప్పున మొత్తంగా 119 ప్రత్యేక పారిశ్రామికవాడలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈజిప్టుతో వాణిజ్య సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తితో ఉందని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై.. మెయిన్స్ కోసం సన్నద్ధమవుతున్న తెలంగాణ అభ్యర్థులకు 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పేరిట లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తూ.. హైదరాబాద్‌లో నిన్న నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నట్లు చెప్పారు. తెలంగాణ నుంచి అత్యధికంగా సివిల్ అధికారులు రావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

---------------------------

ప్రపంచాన్ని మరో అంటూ వ్యాధి భయపెడుతోంది ఆఫ్రికా, ఐరోపా దేశాలలో విస్తరించిన మంకీ ఫాక్స్ దేశంలోని కేరళ రాష్ట్రానికి కూడా చేరింది. ఈ వ్యాధిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ క్రమంలో మంకీ ఫాక్స్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

అందరి సహకారంతో విజయనగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నిన్న విజయనగరం నగరపాలక సంస్థకు చెందిన వాహనాలను స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి గజపతిరాజు తో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయనగరాన్ని పారిశుధ్య నగరంగా మార్చేందుకు కోటి 30 లక్షల రూపాయలతో రెండు స్వీపింగ్ వాహనాలను ప్రారంభించామన్నారు. అలాగే ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి అన్ని ఏర్పాట్లూ చేపడుతున్నామన్నారు. రాష్ట్ర పండుగగా అవసరమైన నిధులను కేటాయించి రాష్ట్రపండుగగా సిరిమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

డా.పూసపాటి విజయరామ గజపతిరాజు –పీవీజీరాజు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 'స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిన్న విజయనగరంలోని మహారాజా కోటలో జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనసభాపతి సి హెచ్ అయ్యన్నపాత్రుడు పాల్గొని మాట్లాడుతూ, పీవీజీరాజు దాన కర్ణుడని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. పీవీజీ రాజు గురించి తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియజేయాలని కోరారు.. కోటను కూడా విద్య కోసం దానమిచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ప్రజల కోసం వేల ఎకరాలు దానం చేశారని, అటువంటి మహనీయులు ఈ ప్రాంతంలో పుట్టినందుకు గర్వపడుతున్నామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

---------------------------

తూర్పు మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో ఈ నెల 29 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో 29, 30 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీ

వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ రోజు పార్వతీపురం మన్యం, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. తెలంగాణలో ఈనెల 29 నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 29వ తేదీన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

---------------------------

చెరువుల ఆక్రమణలపై తెలంగాణ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలపై మంత్రి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆక్రమణకు గురైన చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు.

=========================